క్లుప్తంగా

స్త్రీ, పురుష సమానత్వంతోనే అభివృద్ధి సాధ్యం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): స్త్రీ, పురుష సమానత్వంతోనే సమాజ అభివృద్ధి సాధ్యమని దళిత బహుజన రిసోర్స్ సెంటర్(డీబీఆర్సీ) కన్వీనర్ అల్లాడి దేవకుమార్ అన్నారు. శనివారం ప్రెస్‌క్లబ్‌లో డీబీఆర్సీ ఆధ్వర్యంలో స్త్రీ, పురుష సమానత్వంపై అవగాహన సదస్సు జరిగింది. తొలుత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. సదస్సులో పాల్గొన్న దేవకుమార్ మాట్లాడుతూ డీబీఆర్సీ ఆధ్వర్యంలో స్త్రీ, పురుష సమానత్వంపై రాష్ట్ర వ్యాప్తంగా అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సదస్సులో జిల్లా కోఆర్డినేటర్ జామి రమాదేవి, డీబీఆర్సీ ప్రతినిధులు పాల్గొన్నారు.

బీఆర్టీఎస్ రోడ్డులో సంకల్పయాత్ర



మధురానగర్(విజయవాడసెంట్రల్): ప్రతివ్యక్తికీ 2047 సంవత్సరం నాటికి బీమా రక్షణను అందజేయడమే ప్రధాన లక్ష్యంగా సంకల్పయాత్రను నిర్వహిస్తున్నట్లు టాటా ఏఐఏ లైఫ్ ఇన్సూరెన్సు ఏపీ డైరెక్టర్ ఆఫ్ ఏజెన్సీ కొల్లిపర ప్రసాద్ అన్నారు. స్థానిక బీఆర్టీఎస్ రోడ్డులో శనివారం టాటా ఏఐఏ లైఫ్ ఇన్సూరెన్సు బీమా సంస్థ ఆధ్వర్యాన సంకల్పయాత్ర కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ఏపీలోని 23 బ్రాంచీల ఇన్సూరెన్స్ ప్రొఫెషనల్స్ ఆయా నగరాల్లో సంకల్ప యాత్ర పేరిట అవగాహన ర్యాలీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. సంస్థ ప్రతినిధులు జగదీశ్‌బాబు, చక్రవర్తి, జీకే చైతన్య, రవికుమార్, సంతోష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నగరంలో రాచరికం చిత్రం యూనిట్ సందండి



మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): రాచరికం చిత్ర యూనిట్ శనివారం విజయవాడ నగరంలో సందడి చేసింది. మొగల్రాజపురంలోని జమ్మిచెట్టు సెంటర్ సమీపంలో ఉన్న ఒక హోటల్లో ఆ చిత్రం యూనిట్ సభ్యులు విలేకరులతో మాట్లాడారు. చిత్ర హీరో విజయ్‌శేఖర్ మాట్లాడుతూ రాయలసీమ నేపథ్యంలో రాచరికం చిత్రాన్ని నిర్మించామన్నారు. హ్యాపీడేస్ సినిమాలో హీరోగా నటించిన వరుణ్ సందేశ్ ఈ సినిమాలో విలన్ పాత్రలో మొదటిసారిగా నటిస్తున్నారని, ఆయన నటన చిత్రానికి హైలెట్‌గా ఉంటుందని చెప్పారు. ఈ చిత్రంలో హీరోయిన్‌గా అప్సర రాణి నటించిందని, ఆమె నటన ప్రేక్షకులకు కచ్చితంగా నచ్చుతుందన్నారు. ఇప్పటికే విడుదలైన ట్రైలర్‌కు ప్రేక్షకుల నుంచి విశేష స్పందన లభిస్తోందన్నారు. హీరోయిన్ అప్సర రాణి మాట్లాడుతూ కనకదుర్గమ్మ దర్శనంతో విజయవాడ నగరంలో రాచరికం సినిమాకు సంబంధించిన ప్రమోషన్స్ ప్రారంభించడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఈ చిత్రంలో తన క్యారెక్టర్ ప్రేక్షకులకు ఎప్పటికీ గుర్తుండిపోయే విధంగా ఉంటుందని అన్నారు. ఈ నెల 31న సినిమా విడుదల కానుందని తెలిపారు. దర్శకుడు సురేష్ లంకలపల్లి మాట్లాడుతూ రాచరిక వ్యవస్థ అంటే ఏంటి, ఆ రోజుల్లో ఆ వ్యవస్థ ఎలా ఉండేదనే అంశాలను ఈ చిత్రం ద్వారా నేటి తరానికి తెలియజేస్తున్నామ ని చెప్పారు. కామెడీ, లవ్, యాక్షన్ సన్నివేశాలు ప్రేక్షకులను ఆకట్టుకుంటాయని అన్నారు. చిత్ర నిర్మాతలు ఈశ్వర్, చాణిక్య పాల్గొన్నారు.

దాసాంజనేయునికి ప్రత్యేక పూజలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): స్వయంభూ మాచవరం శ్రీదాసాంజనేయస్వామివారి దేవాలయంలో శనివారం స్వామివారికి ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి ప్రీతికరమైన రోజు కావడంతో పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. వాహన చోదకులు వాహన పూజలు చేయించుకున్నారు. కార్యక్రమాలను ఆలయ కార్యనిర్వహణాధికారి పీ లోకేశ్వరి పర్యవేక్షించారు.

అసాంఘిక కార్యకలాపాలకు అడ్డా..

- భానూనగర్ మసీదు సర్వీసు రోడ్డు
- రోడ్డుపైనే మద్యం, గంజాయి సేవిస్తున్న వైనం



సర్వీసు రోడ్డులో మద్యం సీసాలు



భానునగర్ మసీదు సమీపంలోని సర్వీసు రోడ్డు

మధురానగర్(విజయవాడసెంట్రల్): ఎంకిపెళ్లి సుబ్బిచావుకి వచ్చిన చందంగా మారింది భానూనగర్ మసీదు సమీపంలోని సర్వీసు రోడ్డు పరిస్థితి. నిత్యం రద్దీగా ఉండే భానూనగర్ మసీదు రోడ్డు మధురానగర్ ఆర్‌యూబీ పనులు పూర్తికావడంతో మసీదు సర్వీసు రోడ్డులో రాకపోకలు తగ్గిపోయాయి. దీంతో చీకటిపడే సరికి ఆకతాయిలు ఇక్కడకు చేరుకుని అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారు. ఆర్‌యూబీ పనుల్లో భాగంగా వర్షపు నీరు బయటకు పోయేందుకు నిర్మించిన డ్రెయిన్ ఆకతాయిలకు డెన్‌గా మారిందని స్థానికులు ఆరోపిస్తున్నారు. రాత్రిపూట రైల్వేస్టేషన్‌కు వెళ్లేవారు, వచ్చేవారు బిక్కుబిక్కుమంటూ రాకపోకలు సాగిస్తున్నారు. ఇక్కడ నిత్యం ఆకతాయిలు మద్యం, గంజాయి సేవిస్తూ మద్యం బాటిళ్లు పగులకొడుతూ నానా హంగామా చేస్తున్నా పోలీసులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. మద్యం మత్తులో తమ మీదకు వస్తున్నారని.. చీకటి పడితే ఈ రోడ్డులో వెళ్లలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గస్తీ ఏర్పాటు చేయాలి

ఇక్కడ ఆకతాయిల నుంచి రక్షణ కల్పించేందుకుగానూ గస్తీ ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు. మధురానగర్ రైల్వేస్టేషన్ వద్ద ఆర్‌పీఎఫ్ పోలీసులు ఉండటం లేదని చెబుతున్నారు. అలాగే సత్యనారాయణపురం పోలీసులు కూడా తూతూమంత్రంగా బీట్‌లు నిర్వహిస్తున్నారని ఆరోపిస్తున్నారు. పోలీసులు వచ్చినా వారి విజిల్, హారన్‌లకు పక్కనే ఉన్న రైల్వేకాలనీలోకి వెళ్లిపోయి పోలీసులు వెళ్లగానే ఆకతాయిలు తిరిగి ఇక్కడకు వస్తున్నారని అంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

హిందూ దేవాలయాలపై వివక్ష తగదు

వైఎస్సార్ సీపీ సెంట్రల్ నియోజకవర్గ సమన్వయకర్త మల్లాది విష్ణు



మధురానగర్(విజయవాడసెంట్రల్): హిందూ దేవాలయాలపై వివక్ష తగదని.. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి దేవాలయాల కూల్చివేతలు, అర్చకులపై దాడులు పెరిగిపోయాయని వైఎస్సార్ సీపీ సెంట్రల్ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు శనివారం ఒక ప్రకటనలో విచారం వ్యక్తం చేశారు. విశాఖపట్నం సీతమ్మధారలో అభయాంజనేయస్వామి ఆలయం కూల్చివేతపై ఆయన తీవ్రంగా స్పందించారు. ఎటువంటి నోటీసులు ఇవ్వకుండానే ఆలయాన్ని కూల్చివేయడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. నెల్లూరులోనూ రహదారి విస్తరణ పేరుతో ఇటీవల నాగమ్మ ఆలయాన్ని కూల్చివేసి దేవతామూర్తుల విగ్రహాలను పెకలించారని, పల్నాడులో 15 ఏళ్లుగా భక్తులు పూజిస్తున్న త్రికోటేశ్వర స్వామి, కనకదుర్గమ్మ ఆలయాన్ని కూల్చి వేశారన్నారు. మధురానగర్ కాలువగట్టుపై 40 ఏళ్ల నాటి నాగేంద్రస్వామి పుట్టని తొలగించడంతో పాటు శ్రీకృష్ణ మందిరం వద్ద ఏర్పాటు చేసిన గోశాలను కూడా దౌర్జన్యంగా కూలిచేశారన్నారు. కూటమి ప్రభుత్వం హిందువుల మనోభావాలతో ఆడుకుంటోందని మండిపడ్డారు. అత్యంత పూజ్యమైన తిరుమల ఆలయంతో పాటు పలు హిందూ దేవాలయాల పవిత్రతపై రాజీ పడుతూ.. ఈ ప్రభుత్వం భక్తుల కష్టాలను మరింత తీవ్రతరం చేస్తోందని మల్లాది విష్ణు ఆరోపించారు. హిందూ దేవాలయాలపై రాష్ట్ర ప్రభుత్వం పగబట్టిందని.. సనాతన ధర్మ రక్షకులుగా గప్పాలు కొట్టుకునే నాయకులు వీటిపై ఎందుకు స్పందించరని ప్రశ్నించారు. దేవాలయాలను పరిరక్షించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని.. శ్రీరామనవమిలోగా విశాఖలో కూల్చిన ఆలయాన్ని పునఃప్రతిష్ఠించాలని పేర్కొన్నారు. ఘటన వెనుక ఎవరున్నా కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో వైఎస్సార్ సీపీ పెద్దఎత్తున ఆందోళన చేపడుతుందని హెచ్చరించారు.

రేపటి నుంచి వాసవీ అమ్మవారి ఆత్మార్పణ కార్యక్రమాలు



ఆహ్వాన పత్రికను ఆవిష్కరిస్తున్న పెనుగొండ సుబ్బరాయుడు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): శ్రీ వాసవీ ఫౌండేషన్, విజయవాడ అర్బన్ జిల్లా ఆర్యవైశ్య యువజన సంఘం, వివిధ ఆర్యవైశ్య సంఘాల సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 27 నుంచి 31వ తేదీ వరకూ వాసవీ అమ్మవారి ఆత్మార్పణ కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు ఏపీ ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు పెనుగొండ సుబ్బరాయుడు చెప్పారు. పాతబస్తీలోని ఆర్యవైశ్య కల్యాణమండపంలో శనివారం ఆహ్వానపత్రిక ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాసవీ ఫౌండేషన్ చైర్మన్ వీవీకే నరసింహారావు ఆధ్వర్యంలో గడిచిన 25 సంవత్సరాలుగా వాసవీ జయంతి, వాసవీ అమ్మవారి ఆత్మార్పణ కార్యక్రమాలను ఘనంగా నిర్వహిస్తున్నారని, ఈ ఏడాది రజతోత్సవాన్ని మరింత విస్తృతంగా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అందులో భాగంగా ఈ నెల 27న వాసవీ మూలమంత్ర హోమం, లక్ష్మీ గణపతి హోమం, 28న అష్టలక్ష్మీ సహిత లక్ష్మీ నారాయణ హోమం, 29న మృత్యుంజయ పాశుపత హోమం, 30న వాసవీ వ్రతాలు, 31న అమ్మవారికి అభిషేకాలు, కుంకుమార్చనలు, అమ్మవారి మోక్షగుండ సందర్శనం హోమం తదితర కార్యక్రమాలు ఉంటాయని వివరించారు. సమావేశంలో వివిధ సంస్థల ప్రతినిధులు వీవీకే నరసింహారావు, కొణిజేటి రమేష్, దోగిపర్తి శంకరరావు, నంబూరి ప్రదీప్, సీఎల్ అరుణ్, కె.సతీష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నిరాడంబరుడు భారతరత్న కర్పూరి ఠాకూర్

ఎమ్మెల్సీ దువ్వూరి రామారావు



పుస్తకాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్సీ దువ్వాడ రామారావు తదితరులు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): దేశ రాజకీయ చరిత్రలో నిరాడంబరంగా, నిజాయితీగా జీవించిన నాయకుడు కర్పూరి ఠాగూర్ అని ఎమ్మెల్సీ దువ్వూరి రామారావు అన్నారు. విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ గ్రంథాలయ మందిరంలో శనివారం భారతరత్న కర్పూరి ఠాకూర్ శత జయంతి ముగింపు సభ జరిగింది. సభలో తొలుత కర్పూరి ఠాకూర్‌కు భారత రత్న ప్రకటించిన సందర్భంలో వివిధ పత్రికల్లో వచ్చిన వ్యాసాలతో కూడిన గ్రంథాన్ని ఆవిష్కరించారు. సీనియర్ ఐఏఎస్ అధికారి బి.రామారావు మాట్లాడుతూ నేటి తరం బీసీ నాయకులు, యువకులు కర్పూరి ఠాగూర్‌ను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు మాట్లాడుతూ భవిష్యత్తు అంతా బీసీలదేనని వ్యాఖ్యానించారు. పుస్తక సంపాదకులు డాక్టర్ ఎం ప్రభాకర్, అన్నవరపు బ్రహ్మయ్య, సీహెచ్‌వీవీ సత్యనారాయణ, సాహితీవేత్త, విమర్శకుడు గుంటూరు లక్ష్మీనరసయ్య, రిటైర్డ్ ఐపీఎస్ అధికారి రవీంద్రనాథ్ బాబు, బీసీ నాయకులు కొలనుకొండ శివాజీ, నమ్మి అప్పారావు, రాకేష్ విద్యాసంస్థల అధినేత ఎన్వీ రావు, డెప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ మీరాప్రసాద్, బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు మల్కాపురం కనకారావు, వర్కింగ్ ప్రెసిడెంట్ కొమ్మవరపు భానుప్రసాద్, బీసీ సంక్షేమ సంఘం యువజన అధ్యక్షుడు కుమ్మర క్రాంతికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ బాలికల దినోత్సవం

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): హ్యాపీ లైఫ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సత్యనారాయణపురంలోని ఏకేటీపీ మున్సిపల్ స్కూల్‌లో జాతీయ బాలికల దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న పాఠశాల హెచ్‌ఎం శ్రీనివాసరావు బాలికలకు జాతీయ బాలికా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సమాజంలో ఉన్నత స్థానాలకు చేరుకోవాలంటే చదువు ఒక్కటే మార్గమన్నారు. హ్యాపీలైఫ్ ఫౌండేషన్ గౌరవాధ్యక్షుడు డాక్టర్ మామిడి శ్రీనివాసరావు మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తూ ప్రతిభ చాటుతున్నారని పేర్కొన్నారు. అనంతరం బాలికలకు వ్యాస రచన, క్విజ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సత్యవాణి, సుచరిత, సుబ్బలక్ష్మి, శివ నాగలక్ష్మి, సుజాత, నరసింహారావు, కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

నేడు ఆటల పోటీలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): గణతంత్ర దినోత్సవం పురస్కరించుకుని ఆదివారం రామకృష్ణాపురంలో 30వ డివిజన్ ఆట, పాట నిర్వహణ కమిటీ ఆధ్వర్యాన పలు పోటీలు నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యుడు జీ వెంకటేశ్వరరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం మధ్యాహ్నం రెండు గంటలకు మహిళలకు ముగ్గుల పోటీలు, మ్యూజికల్ చైర్స్, బాస్కెట్‌బాల్, లెమన్ అండ్ స్పూన్ పోటీలు జరుగుతాయన్నారు. 15 సంవత్సరాల లోపు బాలికలకు స్కిప్పింగ్, బాస్కెట్‌బాల్, మ్యూజికల్ చైర్ పోటీలు, బాలురకు రన్నింగ్, స్లోసైక్లింగ్ పోటీలు నిర్వహించడం జరుగుతుందన్నారు. పోటీల్లో విజేతలకు సాయంత్రం బహుమతులు ప్రదానం చేస్తామన్నారు. డివిజన్ వాసులు ఈ పోటీల్లో పాల్గొనాల్సిందిగా ఆయన కోరారు.

ఓటు హక్కుపై అందరికీ అవగాహన అవసరం



వీఎంసీ సిబ్బందితో ఓటు హక్కుపై ప్రతిజ్ఞ చేయిస్తున్న మేయర్ రాయన భాగ్యలక్ష్మి



డీఎంహెచ్ఓ కార్యాలయం వద్ద ప్రతిజ్ఞ చేస్తున్న వైద్య సిబ్బంది



ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ కళాశాలలో ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

పటమట(విజయవాడతూర్పు): ఓటు హక్కుపై అందరికీ అవగాహన కల్పించాలని వీఎంసీ మేయర్ రాయన భాగ్యలక్ష్మి అన్నారు. జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా శనివారం విజయవాడ నగర పాలక సంస్థ మేయర్ రాయన భాగ్యలక్ష్మి ఆధ్వర్యంలో వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూమ్ వద్ద కార్పొరేషన్ సిబ్బందితో జాతీయ ఓటర్ల దినోత్సవం ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఓటు వేయడం అందరి బాధ్యతని, 18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులందరూ యువ ఓటర్లుగా వారి పేర్లను నమోదు చేయించుకోవాలన్నారు. ఓటర్ల నమోదు ప్రక్రియ గురించి ప్రతి ఒక్కరికీ అవగాహన ఎంతో అవసరమన్నారు. కార్యక్రమంలో అకౌంట్స్ ఆఫీసర్ బి.సత్యనారాయణ, సూపరింటెండింగ్ ఇంజినీర్ వర్క్స్ పి.సత్యనారాయణ, ఇన్‌చార్జ్ చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సురేష్ బాబు, మేనేజర్ ఏయూబీ శర్మ కార్పొరేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

స్టెల్లా కళాశాలలో...

జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా స్టెల్లా కళాశాలలో ఓటరు నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాస రచన, ఓటరు నమోదుతో పాటు ఓటు హక్కుపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కళాశాల కరస్పాండెంట్ సిస్టర్ లిన క్వాడ్రస్ మాట్లాడుతూ దేశ సమగ్రతను కాపాడాలంటే నిబద్ధతతో కూడిన నాయకులుండాలనే ధ్యేయంతో ఓటరు దినోత్సవం నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం విద్యార్థులు కళాశాల నుంచి నిర్మల కాన్వెంట్ వరకు సర్వీస్‌రోడ్డులో ఓటు చైతన్యంపై ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ సిస్టర్ రేఖ, డిగ్రీ వైస్ ప్రిన్సిపాల్ ఉషాకుమారి, ఇంటర్ వైస్ ప్రిన్సిపాల్ స్వప్న వున్నం, పొలిటికల్ సైన్స్ విభాగాధిపతి సూరయ్య, విద్యార్థినులు పాల్గొన్నారు.

ఓటు ప్రతి పౌరుడి హక్కు

లబ్బీపేట(విజయవాడతూర్పు): ప్రజాస్వామ్య దేశంలో ఓటు ప్రతి పౌరుడి హక్కు అని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ మాచర్ల సుహాసిని అన్నారు. జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా నగరంలోని డీఎంహెచ్ఓ కార్యాలయంలో ఓటు హక్కుపై ఆమె అవగాహన కలిగించారు. కుల, మత, జాతి వివక్ష లేకుండా స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. అనంతరం సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో డీఎంఓ డాక్టర్ మోతీబాబు, ఎపిడిమియాలజిస్ట్ డాక్టర్ స్నేహస మీర, డాక్టర్ బాలాజీ, గణాంక అధికారి లక్ష్మోజీ, డాక్టర్ విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్‌లో..

మధురానగర్(విజయవాడసెంట్రల్): స్థానిక మాచవరం ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం జాతీయ ఓటరు దినోత్సవ వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ కె. భాగ్యలక్ష్మి విద్యార్థులతో ఓటరుగా నమోదు చేసుకోవడంతో పాటు ఓటు హక్కును తప్పకుండా వినియోగించుకుంటామని ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఓటు అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వార్డు సచివాలయ సిబ్బంది, అధ్యాపకులు పద్మనాభం, సుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

న్యాయస్థానాల్లో రాజకీయ జోక్యం వద్దు

ఐఏఎల్ డిమాండ్



ఐఏఎల్ సమావేశంలో మాట్లాడుతున్న ఆ సంఘ జాతీయ ప్రధాన కార్యదర్శి చలసాని అజయ్‌కుమార్

లబ్బీపేట(విజయవాడతూర్పు): ఇటీవల కాలంలో అసలు ఎవరో, నకిలీ ఎవరో అర్థం కానటువంటి పరిస్థితి ఉందని, న్యాయస్థానాల్లో నకిలీ న్యాయవాదుల హవా ఎక్కువై రాజకీయ జోక్యం పెరిగిందని ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ (ఐఏఎల్) జాతీయ ప్రధాన కార్యదర్శి చలసాని అజయ్‌కుమార్ అన్నారు. అసోసియేషన్ విస్తృత స్థాయి సమావేశం శనివారం ఎంజీ రోడ్డులోని ఓ హోటల్‌లో జరిగింది. ఈ సమావేశంలో అజయ్‌కుమార్ మాట్లాడుతూ విశాఖపట్నం కేంద్రంగా హైకోర్టు బెంచి ఏర్పాటు ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. ఆర్థికంగా వెనుకబడిన యువ న్యాయవాదులకు ఇస్తున్న గౌరవ వేతనం లా నేస్తం పథకాన్ని కొనసాగించాలని కోరారు. ఆర్థిక అవసరాల కోసం బ్యాంకుల్లో అప్పులు చేసే బదులుగా న్యాయస్థానంలోనే పరస్పర సహకార బ్యాంకులు ఏర్పాటు చేయాల్సి ఉందన్నారు. సుప్రీం, హైకోర్టుల్లో సీసీ కెమెరాలు, ఆన్‌లైన్ విధానాన్ని అమలు చేయాలని కూటమి ప్రభుత్వానికి సూచించారు. హక్కుల కోసం పోరాడే వారిపై నిర్బంధాలు విధించడం హేయమైన చర్య అన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేఎస్ సురేష్‌కుమార్, వి.చంద్రశేఖర్‌రెడ్డి, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

గణతంత్ర వేడుకలకు ముస్తాబు

గణతంత్ర దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని విజయవాడలోని ప్రభుత్వ కార్యాలయాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. బాపూజీ మ్యూజియం, కలెక్టరేట్, సబ్‌కలెక్టర్ కార్యాలయం, ఆర్‌అండ్‌బీ అతిథి గృహం పలు శాఖల కార్యాలయాలను అందంగా అలంకరించారు. అలాగే బందరు రోడ్డు డివైడర్‌కు విద్యుత్ దీపాలు ఏర్పాటు చేశారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ



జాతీయ జెండా రంగుల విద్యుత్ లైట్లలో బాపు మ్యూజియం



విద్యుత్ కాంతి వెలుగుల్లో ఆర్‌అండ్‌బీ బిల్డింగ్



ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంకు లైటింగ్



బందర్ రోడ్డులోని డివైడర్‌పై ఉన్న మొక్కలకు విద్యుత్ దీపాలు



ఓటు హక్కుపై చైతన్య స్ఫూర్తి







జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా శనివారం ఓటు హక్కుపై నగర ప్రజలను చైతన్యవంతం చేసేందుకు ర్యాలీ నిర్వహించారు. పాత గవర్నమెంట్ ఆసుపత్రి నుంచి తుమ్మలపల్లి కళాక్షేత్రం వరకు సాగిన ఈ ర్యాలీలో ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి.లక్ష్మీశ, నగర పోలీస్ కమిషనర్ ఎస్‌వీ రాజశేఖరబాబుతో పాటు పలువురు అధికారులు, వందలాది మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కళాక్షేత్రంలో జాతీయ ఓటర్ల దినోత్సవంను ఉద్దేశిస్తూ వేసిన రంగోళి ఆకట్టుకుంది. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. –సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
విజయవాడ సెంట్రల్ : 9010201611
Office mail : sakshiads@gmail.com